వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏబీవీపీ నాయకులు

ఈనెల20 నుంచి 'రాష్ట్రీయ కళామంచ్ సింగిడి'

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 6: ఈనెల 20వ తేదీ నుంచి రెండు రోజుల పాటు రాష్ట్రీయ కళామంచ్ సింగిడి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ హైదరాబాద్ మహానగర ప్రముఖ్ డాక్టర్ రామకృష్ణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పృథ్వితేజ మాట్లాడుతూ.. ఏబీవీపీ అంటే కేవలం ధర్నాలు, రాస్తారోకోలే కాకుండా విద్యారంగ సమస్యలపై నిత్యం పోరాడుతూ విద్యార్థులను చైతన్య పరుస్తామన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని, వారిలో ఉన్న కళానైపుణ్యాలను వెలుగులోకి తీసుకొచ్చేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రతీ ఏటా నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ ఏడాది ఓయూ వేదికగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు శ్రీహరి, జీవన్, తోట శ్రీనివాస్, రాజు, హరిప్రసాద్, సాయి, గణేశ్‌సాగర్, శంకర్, ధృహన్, శివశంకర్, కోటి, ఉదయ్, కార్తీక్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న చేనేత హస్తకళా మేళా

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 6: హబ్సిగూడలోని ఐఐసీటీ స్టాఫ్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కళా సిల్క్ హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్, సేల్స్ ప్రదర్శన ఆదివారంతో ముగియనుంది. ఈ మేళా గత వారమే ముగియాల్సి ఉన్నప్పటికీ, వినియోగదారుల నుంచి అనూహ్య స్పందన లభిస్తున్న నేపథ్యంలో ప్రదర్శనను ఈనెల 7వ తేదీ వరకు పొడిగించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వికాస్ జైన్ మాట్లాడుతూ.. వివిధ రకాల వస్తువులు, సరికొత్త డిజైన్‌లతో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో మహిళలు, యువత అధిక సంఖ్యలో పాల్గొని భారీగా కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. నాణ్యమైన ఉత్పత్తులను అందించి, వినియోగదారుల మన్ననలను పొందడమే లక్ష్యంగా ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రతి రోజూ ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు వినియోగదారులకు అందుబాటులో ఉంటుందన్నారు. అత్యంత నాణ్యమైన వస్తువులు అతి తక్కువ ధరలకు అందుబాటులో ఉన్నందున వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎగ్జిబిషన్‌లో చీరలను తిలకిస్తున్న మహిళలు

ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

- మాదిగలను విస్మరించిన హస్తానికి ఓట్లు అడిగే నైతిక హక్కులేదు
- కాంగ్రెస్‌పై ధ్వజమెత్తిన మాదిగ సంఘాల నేతలు

డైమండ్ పాయింట్ చౌరస్తాలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాదిగ సంఘాల నేతలు ఇటుక శ్రీకిషన్ మాదిగ, ఇటుక గోపి మాదిగ

కంటోన్మెంట్, ఏప్రిల్ 6: కంటోన్మెంట్‌లో జరుగనున్న ఉప ఎన్నికల్లో మాదిగల ఓట్లను అడిగే నైతిక హక్కును కాంగ్రెస్ పార్టీ కోల్పోయిందని మాదిగ సంఘాల నేతలు ఇటుక శ్రీకిషన్ మాదిగ, ఇటుక గోపి మాదిగ స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం డైమండ్ పాయింట్ చౌరస్తాలో ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కాంగ్రెప్ పార్టీకి రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఇప్పటికే సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో జరగబోయే ఉప ఎన్నికల్లో మాదికలకే ప్రధాన పార్టీలు టికెట్లు కేటాయించాలని మాదిగ బలగం నుంచి మాదిగ సంఘాలు ఐక్యమై పోరాడుతున్న సందర్భంలో కాంగ్రెస్ పార్టీ మాదిగలను విస్మరించి వివక్షత చూపిందని మండిపడ్డారు. మాదిగలపై 45ఏండ్లుగా రాజకీయ వివక్షత కొనసాగుతుందని, కంటోన్మెంట్‌లో కాంగ్రెస్ పార్టీ దానినే కొనసాగిస్తూ మరోసారి తన కపట ప్రేమను చూపిందని దుయ్యబట్టారు. మరో రెండు ప్రధాన పార్టీలు కూడా అదే దారిలో పోతాయా లేక తమకు జరుగుతున్న అన్యాయంపై స్పందించి న్యాయం చేస్తాయా చూడాలన్నారు. మాదిగలను విస్మరించే పార్టీలకు ఓటు ద్వారా గుణపాఠం చెబుతామని, భవిష్యత్తు కార్యాచరణను రెండు ప్రధాన పార్టీలు కూడా తమ అభ్యర్థులను ప్రకటించిన అనంతరం ప్రకటిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాదిగ సంఘాల నేతలు అజిత్ కల్యాణ్, దర్గా రవి మాదిగ, ఉప్పులేటి రాజేందర్ మాదిగతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా శ్రీగణేశ్

కంటోన్మెంట్, ఏప్రిల్ 6: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నికకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ప్రకటించింది. కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థిగా శ్రీగణేశ్ పేరును ఖరారు చేసింది. ఈ మేరకు శనివారం శ్రీ గణేశ్ పేరును కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ ప్రకటించారు. అయితే, శ్రీగణేశ్ ఇటీవలే బీజేపీని వీడి హస్తం గూటికి చేరారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీ చేసిన శ్రీగణేశ్ రెండో స్థానంలో నిలిచారు. ఇక, బీఆర్ఎస్ తరుపున పోటీ చేసి లాస్య నందిత విజయం సాధించారు. కాగా, ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో లాస్య మృతిచెందడంతో కంటోన్మెంట్‌లో ఉప ఎన్నిక జరుగనున్నది. తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికలతో పాటే కంటోన్మెంట్ ఉప ఎన్నిక కూడా జరుగనుంది.

పార్టీ అభిష్టానానికి కృతజ్ఞతలు..

కాంగ్రెస్ పార్టీ కంటోన్మెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా తన పేరును ప్రకటించడంపై ఏఐసీసీ, టీపీసీసీలకు శ్రీ గణేశ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటోన్మెంట్ నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తూ, ప్రజలకు అంకితభావంతో పనిచేస్తూ కృతజ్ఞతా భావంతో ఉంటానని స్పష్టం చేశారు. ఆలిండియా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మైనంపల్లి హన్మంతరావు, వెన్నెల గద్దర్‌తో సహా కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రంలో 'ఈసీఈ డే'

బన్సీలాల్‌పేట్, ఏప్రిల్ 6 : భోలక్‌పూర్‌లోని కృష్ణానగర్-2 అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం 'ఈసీఈ డే' సందర్భంగా శారీరక ప్రగతి రిపోర్ట్‌లను అందజేశారు. టీచర్ పి.సావిత్రి మాట్లాడుతూ.. రెండున్నరేండ్ల నుంచి ఐదేండ్లలోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్య నేర్పించామని అన్నారు. క్రమశిక్షణ, సమయపాలన, వ్యక్తిగత పరిశుభ్రత, మంచి అలవాట్లు, పెద్దలను గౌరవించడం, పుస్తక పఠనం గురించి శిక్షణ ఇచ్చామని తెలిపారు. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదల కోసం ప్రతిరోజు పోషక విలువలు కలిగిన ఆహారం అందించాలని తల్లిదండ్రులను కోరారు. ఐదేండ్లు నిండిన పిల్లలను స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలని సూచించారు. గాంధీ దవాఖాన ఆరోగ్య కేంద్రం పీహెచ్ఎన్ సత్యమ్మ, ఆశా వర్కర్ రజనీ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు రిపోర్టులను ఇచ్చిన టీచర్ సావిత్రి

శివలింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాలు

కంటోన్మెంట్, ఏప్రిల్ 6: శ్రీదేవి నల్లపోచమ్మ, శివలింగేశ్వర స్వామి దేవాలయం 26వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలు మూడు రోజులపాటు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు అశోక్, యాదవ రావు తెలిపారు. శనివారం రెండో రోజు శ్రీ లక్ష్మీనరసింహ సహిత మృత్యుంజయ హోమం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి, హోమంలో పాల్గొన్నారు. మూడోరోజు ఆదివారం ఉదయం 8 గంటలకు మహా చండీ హోమం, వివిధ ప్రత్యేక పూజలతో పాటు అన్నప్రసాద కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు అశోక్, యాదవరావు చెప్పారు. ఈ కార్యక్రమంలో హరికృష్ణ, సిద్దు, జంపన రాజేశ్, వరప్రసాద్, వెంకటేశ్, నరేశ్, పవన్‌తో పాటు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీదేవి నల్లపోచమ్మ, శ్రీ శివలింగేశ్వర స్వామి దేవాలయం వార్షికోత్సవాల్లో పాల్గొన్న బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్

తుక్కుగూడ సభకు భారీగా తరలిన కాంగ్రెస్ శ్రేణులు

కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో నిర్వహిస్తున్న జనజాతర బహిరంగ సభకు శనివారం కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీ గణేశ్ ఆధ్వర్యంలో నియోజకవర్గం నుంచి సుమారు 100 వాహనాల్లో బయలుదేరారు. ఈ సందర్భంగా ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు.

– కంటోన్మెంట్, ఏప్రిల్ 6:

నాలాల పూడికతీత పనులు ప్రారంభం

- క్యాచ్‌పిట్లలో పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపు
- నెలాఖరులో పనులు పూర్తిచేస్తాం : జీహెచ్ఎంసీ డీఈ

రాజ్‌నగర్ మక్తా ప్రాంతంలో ఉన్న నాలాలో వ్యర్థాలను తొలగిస్తున్న హిటాచి వాహనం

ఖైరతాబాద్, ఏప్రిల్ 6: వర్షాకాలంలో వరద ముంపును నివారించేందుకు జీహెచ్ఎంసీ కార్యాచరణ ప్రారంభించింది. గతంలో నాలాల్లో వ్యర్థాలు పేరుకుపోవడం వల్ల అనేక కాలనీలు, బస్తీలు జలమయమయ్యాయి. ఆ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని డీసిల్టింగ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సర్కిల్ 17 పరిధిలోని మూడు మేజర్ నాలాల్లో మూడు హిటాచి వాహనాలతో వ్యర్థాలను తొలగిస్తున్నారు. ఈ ఏడాది వర్షాకాలానికి నెల రోజులకు ముందే నాలాల్లో పూడిక తీస్తారు.

రూ. 80లక్షలతో పనులు..

ఖైరతాబాద్ సర్కిల్ పరిధిలోని మూడు మేజర్ నాలాల్లో డీసిల్టింగ్ పనులు చేపట్టారు. అందులో తుమ్మలబస్తీ నుంచి రాజ్‌నగర్ మీదుగా నెక్లెస్‌రోడ్‌లోని ఎస్టీపీ వరకు, సోమాజిగూడలోని స్కిల్ ఆర్కెడ్ నుంచి ఎల్లారెడ్డిగూడ, మైత్రివనం వెనుక వైపులో ఉన్న నాలాను డిసీల్టింగ్ కోసం మూడు హిటాచి వాహనాలను ఉపయోగిస్తున్నారు. రూ. 85 లక్షలతో చేపట్టిన ఈ పనులు ఏప్రిల్ నెలాఖరులోగా పూర్తి చేస్తామని జీహెచ్ఎంసీ డీఈ చైతన్య తెలిపారు. వీటితో పాటు ఖైరతాబాద్, ప్రసాద్ ఐమాక్స్, నిమ్స్, లక్కీ రెస్టారెంట్ ప్రాంతాల్లో క్యాచ్‌పిట్లలో పేరుకుపోయిన వ్యర్థాలను సైతం తొలగిస్తున్నామని తెలిపారు.

అలరించిన కూచిపూడి నృత్యం..

రామంతాపూర్, ఏప్రిల్ 6: ఉప్పల్ మినీ శిల్పారామంలో శనివారం విశ్వప్రభ బృందంచే కూచిపూడి నృత్యం ఎంతగానో అలరించింది. కస్తూరి తిలకం, గురు బ్రహ్మ, గజానన, అంగికం, భవనం, వినాయక కౌతం, కొలువైతినా, జతి స్వరం, కృష్ణ, కలయసఖీ, బ్రహ్మాంజలి, దశావతార, తదితర కీర్తనలు అలరించాయి. కార్యక్రమంలో విదిష, సాన్విక, యువిన, ప్రణవి, లక్ష్మిప్రియా, వసుధ, సంజన, రుచిక, సహస్ర, శ్రీహిత, వైష్ణవి, కృతి, నిత్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువతికి తీవ్ర గాయాలు

వెంగళరావునగర్, ఏప్రిల్ 6: ఇంటర్వ్యూకు వెళ్లి తిరిగి వస్తుండగా ద్విచక్ర వాహనం ఢీకొని యువతికి తీవ్ర గాయాలైన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరుకు చెందిన ప్రశాంతి(24) ఏడాది క్రితం ఉద్యోగం నిమిత్తం నగరానికి వచ్చి అమీర్‌పేట శివబాగ్‌కాలనీలోని హాస్టల్‌లో ఉంటుంది. శనివారం ఉదయం ఎస్ఆర్‌నగర్‌లోని ఓ సంస్థ కార్యాలయానికి ఇంటర్వ్యూకు వెళ్లింది. తిరిగి హాస్టల్‌కు నడుచుకుంటూ బయలుదేరింది. ఐసీఐసీఐ బ్యాంకు వద్ద రోడ్డు దాటుతుండగా అమీర్‌పేట వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకులు యువతిని ఢీకొట్టారు. దీంతో ఆమె కాలు విరిగి, తలకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రమాదానికి కారణమైన యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయండి

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 6: రాష్ట్ర వ్యాప్తంగా రవాణా రంగంలో పనిచేసే కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వయం ఉపాధి పొందేందుకు ప్రైవేట్ ఫైనాన్సియర్ల వద్ద రుణాలు తీసుకుని ఆటోలను కొనుగోలు చేసుకుని ఆటో డ్రైవర్లు జీవనం సాగిస్తున్నారని తెలిపారు. రవాణా శాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు పలు విధాలుగా ఛలాన్లు విధిస్తూ మరింత ఆర్థిక భారం మోపుతున్నారని ఆరోపించారు. యాభై ఏండ్లు నిండిన ఆటో డ్రైవర్లకు పింఛను ఇవ్వడంతోపాటు ప్రమాదబీమా రూ. 10 లక్షలకు పెంచాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో నష్టపోతున్న ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయంగా జీవనోపాధి మార్గాలను చూపించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

మతతత్వ శక్తుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలి

హిమాయత్‌నగర్ ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో పుస్తకం ఆవిష్కరిస్తున్న దివికుమార్, తదితరులు

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 6: బీజేపీ అండతో దేశంలో సంఘ్ పరివార్ శక్తుల ఆగడాలు పెరుగుతున్నాయని, వాటికి అడ్డుకట్టవేయాల్సిన అవసరం ఉందని జన సాహితి అధ్యక్షుడు దివి కుమార్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీఎస్ బోస్ అన్నారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో మహారాష్ట్ర మాజీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఎస్ఏం ముష్రిఫ్ రచించిన కర్కారే ఎవరు చంపారు? అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో సంఘ్ పరివార్, బీజేపీలు హిందూ మతాన్ని వారి కుటిల రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. విభిన్న మతాలు, సంస్కృతులు, సంప్రదాయాలు ఉన్న దేశంలో ప్రజల మధ్య అశాంతిని నెలకొల్పే ప్రయత్నం బీజేపీ చేస్తున్నదని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్, సినీ దర్శకుడు సి.ఉమామహేశ్వర్‌రావు, సామాజిక శాస్త్రవేత్తలు డాక్టర్ సోమ్‌మర్ల, డాక్టర్ అజయ్ శర్మ, ఆల్ ఇండియా ప్రొగ్రెసివ్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ బి.స్టాలిన్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి కార్యకర్తలే బలం

మారేడ్‌పల్లి, ఏప్రిల్ 6: భారతీయ జనతా పార్టీకి కార్యకర్తలే బలమని సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జే.రామకృష్ణ అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం వార్డు 5 మహాత్మాగాంధీనగర్ బస్తీలో బీజేపీ నాయకులు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక కార్యకర్తలు, నాయకులతో కలిసి బీజేపీ జెండాను జే.రామకృష్ణ ఆవిష్కరించారు. రాష్ట్ర బీజేపీ నాయకులు పరశరాం, సతీశ్ కుమార్, బల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

బొల్లారంలో..

బొల్లారం, ఏప్రిల్ 6: కంటోన్మెంట్ ఎనిమిదో వార్డు బొల్లారం రిసాల బజార్‌లో వార్డు అధ్యక్షుడు కిరణ్ కుమార్ బీజేపీ సీనియర్ నాయకులతో కలిసి జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో జైనపల్లి శ్రీకాంత్, నర్సింగ రావు, ధనుంజయ్ చారి, కల్యాణి, దుర్గా ప్రసాద్, శ్రీనివాస్ యాదవ్, నితీశ్, వినోద్, ధన్‌రాజ్, హరికేశ్ తదితరులు పాల్గొన్నారు.

21ఏండ్లుగా చలివేంద్రం

ఖైరతాబాద్, ఏప్రిల్ 6: ఖైరతాబాద్‌లో శివలాల్‌యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 21ఏండ్లుగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది కూడా అదే స్ఫూర్తితో రైల్వే గేట్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ట్రాఫిక్ సీఐ రాజశేఖర్, ఎస్సై మధు, ట్రస్ట్ చైర్మన్ మహేశ్‌యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో కె.రాజు, చంద్రశేఖర్, ప్రవీణ్‌యాదవ్, మనోహర్, రమాదేవి, అంజయ్య పాల్గొన్నారు.

ఖైరతాబాద్‌లో చలివేంద్రాన్ని ప్రారంభించిన సీఐ రాజశేఖర్, మహేశ్‌యాదవ్